సాక్షి
వైఎస్సార్ జిల్లా

గురువారం । 16 । జనవరి । 2025



'స్వాహా'కార సంఘం!

కడపలోని పోలీస్ కో ఆపరేటివ్ సొసైటీలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి చేతివాటంతో రూ.కోటి ఏడు లక్షల మేరకు గోల్‌మాల్ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. -8లో



పట్టుకున్నారు .. వదిలేశారు!

గుర్రంకొండలో పోలీసులు రేషన్ బియ్యం లారీని ఉదయం పట్టుకొని సాయంత్రం వదిలేశారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్ వద్ద రోజంతా హైడ్రామా నడిచింది. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
28.9/17.6

జిల్లాలో బుధవారం 17.6 - 28.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

చెన్నకేశవా.. కరుణించవా



శ్రీదేవి,భూదేవిలతో శ్రీ చెన్నకేశవస్వామి

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలి తాళ్లపాకలో, అన్నమయ్య ఆరాధించిన శ్రీ చెన్నకేశవునికి బుధవారం పార్వేట ఉత్సవం నిర్వహించారు. శ్రీచెన్నకేశవ, శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు. అనంతరం పార్వేట ఉత్సవానికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని చెన్నకేశవా.. కరుణించవా అని వేడుకున్నారు. తాళ్లపాక సర్పంచి గౌరీశంకర్, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీల్లో ప్రతిభ



బంగారు పతకాలు సాధించిన పి.ఆసియా

ప్రొద్దుటూరు కల్చరల్: అంతర్జాతీయ జంప్‌రోప్ పోటీల్లో ఇస్లామిక్ పాఠశాలలో 6వ తరగతి విద్యార్థిని పి.ఆసియా గోల్డ్ మెడల్స్ సాధించింది. నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి జంప్‌రోప్ పోటీల్లో బంగారు పతకం, మహారాష్ట్ర నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించి ఇండో-నేపాల్ జంప్‌రోప్ ఛాంపియన్‌షిప్-2025 పోటీలకు ఎంపికైంది. ఇటీవల నేపాల్ దేశంలోని పోఖరాలో జరిగిన ఈ జంప్‌రోప్ పోటీల్లో అండర్-12 బాలికల విభాగంలో 30 సెకండ్స్ రిలే, లాంగ్‌రోప్ స్కిల్ విభాగాల్లో ప్రతిభ కనపరచి రెండు బంగారు పతకాలు సాధించింది. ఆసియాను పాఠశాల కరస్పాండెంట్ ఉమర్, ప్రధానోపాధ్యాయుడు షాహిద్, వ్యాయామ ఉపాధ్యాయురాలు హసీనా, ఉపాధ్యాయులు అభినందించారు.

ఢిల్లీ యువజనోత్సవాల్లో మదనపల్లె విద్యార్థినులు

మదనపల్లె: వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర మానవవనరుల శాఖ న్యూఢిల్లీలో మూడురోజుల పాటు నిర్వహించిన యంగ్ లీడర్స్ డైలాగ్, నేషనల్ యూత్ ఫెస్టివల్-2025కు ఆంధ్రప్రదేశ్ తరఫున మదనపల్లె జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థినులు హాజరయ్యారు. ఈనెల 12, 13 తేదీల్లో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో లంబాడీ నృత్యప్రదర్శనలు ఇచ్చి సభికులను అలరించారు. అనంతరం ఎయిర్‌పోర్ట్ ఆఫీసర్స్ క్లబ్‌లో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, అమలాపురం ఎంపీ జి.హరీష్ మాథుర్ సమక్షంలో నృత్యప్రదర్శనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బహుమతులు అందజేసి సన్మానించారు. నృత్యప్రదర్శనలకు డాన్స్, డప్పుమాస్టర్‌లుగా సురేష్, రామ్మోహన్, నాగరాజు వ్యవహరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ సురభిరమాదేవి విద్యార్థినులను అభినందించారు.

రామయ్యను దర్శించుకున్న కలెక్టర్



పూజల్లో పాల్గొన్న వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ దంపతులు

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయాన్ని మంగళవారం సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శ్రీధర్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి, బాలాలయంలోని మూల మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. వీరి వెంట మండల రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సిద్దవటం కోట సందర్శన

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లి రాజుల కోటను మంగళవారం సాయంత్రం వైఎస్సార్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ సందర్శించారు. ఈ సందర్భంగా కోటలోని ముఖద్వారం, మొదటి, రెండో మండపాలు, పార్కులు, ఈద్గా, ఢంకానగర్, తవ్వకాల్లో బయల్పడిన శివలింగం, మూతి విరిగిన నంది విగ్రహం, కామాక్షమ్మగుడి, బిస్మిల్లాషా ఖాద్రి దర్గా, రాణి స్నానవాటిక, రాణీమహల్‌ను తిలకించారు. కోటలోని కట్టడాలకు సంబంధించి పురావస్తు శాఖ గైడ్ పాశెం నరసింహులు కలెక్టర్‌కు తెలియజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడి శిల్పాలు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నాడు బెదిరించారు.. నేడు కొల్లగొట్టారు





- ప్రభుత్వం మాదే.. మాకేమి కాదనే ధీమాతో అక్రమ తరలింపు
- నాడు కత్తులతో వెళ్లి అక్రమ మైనింగ్‌దారుల బెదిరింపులు
- టిఫిన్ బెరైటీస్ సూపర్‌వైజర్లకు హెచ్చరికలు జారీ
- సీసీ కెమెరాలను బిగించకుండా అడ్డగింత
- న్యాయం చేయాలంటూ వేముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు



టిఫిన్ కంపెనీ ప్రాంగణంలో నిల్వ ఉన్న బెరైటీస్ ఖనిజం


సాక్షి

తలకాయలు తీస్తాం..!

ప్రభుత్వం మాదే.. మాకేమీ కాదు

టీడీపీ నేతల బెదిరింపులపై గతంలో సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ప్రతినిధి, కడప: 'అధికారం మాదే.. మా ఇష్టమొచ్చినట్లు మైనింగ్ చేస్తాం. సీసీ కెమెరాలు బిగిస్తే సహించం. చెప్పినట్లు వినకుంటే తలకాయలు తీస్తాం. ప్రభుత్వం మాదే.. మాకేమి కాదు.'కత్తులతో వెళ్లిన ఓ గ్యాంగ్ మూన్నెళ్ల క్రితం హల్‌చల్ చేసింది. అక్రమ మైనింగ్ నుంచి స్వీయ రక్షణ కోసం సూపర్‌వైజర్లు సీసీ కెమెరాలు బిగిస్తుంటే రెచ్చిపోయారు. చరిత్ర తెలుసుకొని మసలుకోండి. మీరెమన్నా పెద్ద మొనగాళ్లా అంటూ రెచ్చిపోయారు. అదే విషయాన్ని బాధితులు వేముల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి చర్యలు లేవు. తదుపరి అదును చూసి వేల టన్నుల బురైటీస్ ఖనిజాన్ని కొల్లగొట్టారు.

- వేముల మండలంలోని టిఫిన్ బెరైటీస్ కంపెనీ లీజు మైనింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు ఆ కంపెనీ పరిధిలో అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఈనేపథ్యంలో లీజు ప్రాంతంలో నిరంతరం కాపాలా ఉండేలా టిఫిన్ బెరైటీస్ కంపెనీ ఐదుగురు సూపర్‌వైజర్లను నియమించుకుంది. అక్రమ కార్యకలాపాల నుంచి స్వీయ రక్షణ కోసం అక్టోబర్ 21న సీసీ కెమెరాలు లీజు పరిసరాల్లో ఏర్పాటు చేసుకున్నారు. ఆ విషయాన్ని తెలుసుకున్న స్థానిక టీడీపీ నేత పేర్ల పార్థసారధిరెడ్డి సోదరుడు శేషారెడ్డి రెండు వాహనాల్లో మనుషులతో వెళ్లి హంగామా చేశారు. ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు బిగించవద్దని హెచ్చరించారు. మా ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నామని సూపర్‌వైజర్లు వివరిస్తే, తలకాయలు తీసుకెళ్తాం, మాకేమి కాదు, ప్రభుత్వం మాదే, అటు వెళ్తాం, ఇటు వస్తాం అంటూ కత్తుల ప్రదర్శన చేశారు. మాకేమి కేసులు కొత్త కాదు, జైలు జీవితం గడిపే వచ్చాం. మా ప్రభుత్వంలో ఎలాంటి అనుమతులు లేకపోయినా సరే, మేము మైనింగ్ చేసుకుంటాం. మీరెవ్వరూ అడ్డుచెప్పడానికంటూ తెలుగుతమ్ముళ్లు రెచ్చిపోయారు. టిఫిన్ మైనింగ్ కంపెనీ వద్ద సీసీ కెమెరాలను అమర్చకుండా అడ్డుకుని వెనక్కి పంపారు. ఇక్కడ కనిపిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ ప్రాంతానికి ఇకపై ఎవరూ రాకూడదని, ఎవరైనా వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి వస్తుందని గట్టిగా హెచ్చరించారు. అదే విషయాన్ని సూపర్‌వైజర్లు టిఫిన్ బెరైటీస్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. యాజమాన్య ప్రతినిధుల సూచనల మేరకు సూపర్‌వైజర్లు వేముల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశారు.

నిమ్మకు నీరెత్తినట్లుగా మైనింగ్‌శాఖ

నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ ద్వారా కొనుగోలు చేసిన బెరైటీస్ ఖనిజాన్ని కాపాడుకోలేని దయనీయమైన పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి. మైనింగ్‌శాఖ నిర్లక్ష్యం, అధికారమత్తులో జోగుతుండడమే అందుకు ప్రధాన కారణమని పలువురు వివరిస్తున్నారు. కోట్లాది రూపాయల ఖనిజాన్ని కొల్లగొడుతున్నారని ప్రత్యక్షంగా ఫిర్యాదులొచ్చినా అటువైపు కన్నెత్తి చూసిన పాపానపోలేదు. దీంతో అక్రమ మైనింగ్, లీజుదారుల ఖనిజం లూటీ తెరపైకి వచ్చాయని పలువురు వివరిస్తున్నారు. పవన్ మినరల్స్, డైమెండ్ మినరల్స్, జకరయ్య మినరల్స్‌కు లూటీ చేసిన బెరైటీస్ ఖనిజాన్ని తరలించారని టిఫిన్ కంపెనీ కేర్ టేకర్ రామలింగారెడ్డి ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మైనింగ్‌శాఖలో చలనం ఉంటే ఆయా మినరల్స్ కంపెనీల్లో ఉన్న స్టాకు ఎంత? ఎవరి మైనింగ్ నుంచి ఎంత మోతాదులో తీసుకొచ్చారన్న విషయాన్ని రికార్డులను పరిశీలిస్తే లూటీ వ్యవహారం నిగ్గుతేల్చే అవకాశం లేకపోలేదు. అలాంటి చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం ఏమాత్రం చొరవ చూపే అవకాశం లేదని, సర్వోన్నతాధికారికి చిత్తశుద్ధి ఉన్నట్లు అస్సలు కన్పించడం లేదని విశ్లేషకులు ఆరోపిస్తున్నారు.

వ్యవస్థలు నిర్వీర్యం కావడంతోనే...

వ్యవస్థ తనంతట తాను రాజ్యాంగానికి లోబడి వ్యవహరిస్తే, చట్టం తన పని తాను చేసుకపోతుంది. అప్పుడే కొంతలో కొంతైనా ప్రజల ధన, మాన ప్రాణాలకు రక్షణగా నిలుస్తుంది. వ్యవస్థలు నిర్వీర్యం అయితే దౌర్జన్యపరులదే రాజ్యం.. దోపిడీ దారులదే భోజ్యం అన్నట్లుగా ఉండిపోతుంది. టిఫిన్ బెరైటీస్ ప్రతినిధులు పేర్ల పార్థసారధిరెడ్డి సోదరుడు పేర్ల శేషారెడ్డి అండ్ కో బెదిరింపులకు పాల్పడింది. తలకాయలు తీస్తామంటూ హెచ్చరికలు చేశారని వాపోయి, పోలీసులను ఆశ్రయిస్తే చర్యలు శూన్యం. దీంతో అదే కంపెనీకి చెందిన రూ.10కోట్ల విలువైన బెరైటీస్ ఖనిజం రాత్రికి రాత్రి లూటీ అయింది. తాజాగా ఆ కంపెనీ కేర్ టేకర్ వేల్పుల రామలింగారెడ్డి సైతం పార్థసారధిరెడ్డి, శేషారెడ్డి, శ్రీనాథరెడ్డి నేతృత్వంలోనే అక్రమంగా తరలించకపోయారని బాహాటంగా ఆరోపణలు చేస్తున్నారు. వేముల పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా ఆశించిన చర్యలు కన్పించలేదు. స్టాకు ఎక్కడెక్కడికి తరలించారు. ఏయే లారీల్లో తీసుకెళ్లారన్న విషయాన్ని లారీ నంబర్లుతో సహా వివరిస్తున్నారు. చట్టానికి లోబడి అధికారులు వ్యవహరిస్తే వెంటనే బెరైటీస్ స్టాకు స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితి జిల్లాలో కన్పించలేదని పలువురు వాపోతున్నారు. వ్యవస్థలు నిర్వీర్యం కావడమే అందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. ఈ వ్యవహారాన్ని నాలుగురోజులు తాత్సారం చేస్తే బెరైటీస్ పౌడర్‌గా మారిపోయి, ఎక్స్‌పోర్టు చేసి తద్వారా భారీగా అక్రమ ఆదాయం గడించే అవకాశం లేకపోలేదు.

గండం గట్టెక్కారు

గండికోట జలాల్లో చిక్కుకున్న యువకులను రక్షించిన పోలీసులు

కొండాపురం/ముద్దనూరు: కొండాపురం మండల పరిధిలోని గండికోట జలాశయం వద్దకు ముద్దనూరుకు చెందిన ఐదుగురు యువకులు వెళ్లి ఆపదలో చిక్కుకున్నారు. వారిని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, కొండాపురం సీఐ మహమ్మద్ రఫీ రక్షించినట్లు బుధవారం రాత్రి తెలిపారు. సీఐ కథనం మేరకు వివరాలు.. గండికోట ప్రాజెక్టు గేట్ సమీపంలోని రెండు తెప్పల్లో ఆక్సిస్ బ్యాంక్ ఉద్యోగి అల్తాఫ్, కౌసిక్, గురివిరెడ్డి, పవన్ (సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు), ప్రశాంత్ రెడ్డి (మహేంద్ర షోరూం), సరదా కోసం గండికోట జలాశంలోని వెనుక జలాల వద్దకు సాయంత్రం 4 గంటల సమయంలో వెళ్లారు. వీళ్లందరు రెండు తెప్పలల్లో గెట్‌టుగెదర్ కోసం వెళ్లి ఆపదలో చిక్కుకున్నారు. వీరు పోలీసులకు 8 గంటల సమయంలో సమాచారం అందించారు. వెంటనే పోలీసులు సిబ్బందితో వెళ్లి సుమారు రెండున్నర గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు వారిని రక్షించినట్లు సీఐ తెలిపారు. గండికోట జలాశయం వద్దకు వెళ్లిన వారికి ప్రమాద హెచ్చరికలు జారీ చేస్తున్నామన్నారు. ఇక్కడి వచ్చేవారు పోలీసుల ఆదేశాలను అతి క్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో కొండాపురం ఎస్ఐ విద్యాసాగర్, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.



యువకులతో మాట్లాడుతున్న పోలీసులు

పుష్పగిరిలో పార్వేట ఉత్సవం



పుష్పగిరిలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామివార్ల గ్రామోత్సవం



ఒంటిమిట్టలో పార్వేట ఉత్సవానికి శృంగిశైలి పర్వతంపైకి వెళుతున్న సీతారాములు

వల్లూరు: పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా కనుమ పండుగను పురస్కరించుకుని బుధవారం శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి, శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వాముల పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. కొండపైన వున్న శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి ఆలయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్న కేశవ స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఆశీనులను చేసి గ్రామంలోకి మోసుకుని వచ్చారు. అనంతరం స్వామివార్లతో బాటు శ్రీ కామాక్షీ సమేత వైద్యనాథేశ్వర స్వామిని దివిటీల వెలుగులు, మంగళ వాయిద్యాల నడుమన భక్తులు పల్లకీలలో మోస్తూ గ్రామం పక్కన ఉన్న పొలాల్లోకి తీసుకొచ్చారు. అక్కడ పూజారులు స్వామి వార్లకు పూజలను నిర్వహించారు. పార్వేటకు ముందు కుందేలుకు స్వామివార్ల ఎదుట పూజలు జరిపారు. అనంతరం జరిగిన పార్వేట ఉత్సవంలో ప్రజలు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు. అనంతరం పుష్పగిరి మాడ వీధులలో ఇరువురు స్వాములకు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట: ఏకశిలానగరి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో బుధవారం కనుమ పండుగ సందర్భంగా తిరుమల-తిరుపతి దేవస్థానం (టీటీడీ) వారు రామయ్య పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాల నడుమ కార్యక్రమం కొనసాగింది. శృంగిశైలి పర్వతంపై ఉన్న పార్వేట మండపంలో ఆలయ అర్చకులు వీణ రాఘవాచార్యులు, శ్రావణ్ కుమార్, పవన్ కుమార్‌లు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

బాలలకు నవోదయం



మదనపల్లెలోని నవోదయ విద్యాలయం



కంప్యూటర్ తరగతులకు హాజరైన విద్యార్థులు

- ఈనెల 18న ప్రవేశ పరీక్ష నిర్వహణ
- సీటు సాధించాలంటే మెలకువలు తప్పనిసరి

ప్రవేశ పరీక్ష తేదీ: 18-1-2025
ప్రవేశం: 6వ తరగతి
పరీక్షా కేంద్రాలు: 26
సమయం: ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు
దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు: 5058
సీట్లు: రాజంపేటలో 80, మదనపల్లెలో 80

పరీక్ష రకం	ప్రశ్నలు	మార్కులు	కాలవ్యవధి
మేధాశక్తి	40	50	60 నిమిషాలు
అంక గణితం	20	25	30 నిమిషాలు
భాషా పరీక్ష	20	25	30 నిమిషాలు

మదనపల్లె సిటీ: గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థుల జీవితానికి జవహర్ నవోదయ విద్యాలయం విజ్ఞాన వారధిగా నిలుస్తోంది. విలువలతో కూడిన విద్య, నైపుణ్యాలు, దేశభక్తి, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం, ఎన్‌సీసీ ఇలా అన్నింటికి నవోదయ విద్యాలయం ప్రసిద్ధి. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సామాన్య, బడుగు, బలహీనవర్గాల పేద విద్యార్థులకు విద్యనందిస్తోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లె సమీపంలోని వలసపల్లెలోని నవోదయ విద్యాలయం, ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిధిలోని రాజంపేట నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఈనెల 18న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో ఇందులో సీటు సాధించేందుకు మెలకువలను అక్కడి ఉపాధ్యాయులు తెలియజేస్తున్నారు. ఒకే బుక్‌లెట్‌లో (ప్రశ్నపత్రం) మూడు భాగాలుంటాయి.

అంకగణితం పరీక్ష



ప్రవేశ పరీక్షలో అంకగణితంలోని 23 చాప్టర్ల నుంచి ఒక లెక్క వస్తుంది. సరాసరి, సంఖ్యల మీద మూల ప్రక్రియ, దశాంశాలను భిన్నంకాలుగా మార్చడం, భిన్నాంకాలను దశాంశాలుగా మార్చడం, వివిధ రకాల కొలతలు, పొడవులు, శక్తి, కాలం, ధనం మొదలైన వాటితో సంఖ్యతో వినియోగం, చిన్న సంఖ్యలు భిన్నంతో కూడిక, తీసివేత, గుణకారం,శాతాన్ని లెక్కించడం, లాభం, నష్టం (శాతం లెక్కింపు లాభం, నష్టం అంశం నుంచి వినహాయింపు) చుట్టుకొలత, ప్రాంతం-బహుభుజి, దీర్ఘచతురస్రం, త్రిభుజాలు వస్తాయి. వీటిపై ఎక్కువ సాధన చేయాలి. కోణం రకాలు, బార్ రేఖాచిత్రం తప్పకుండా వస్తుంది.

-చలపతినాయుడు, గణిత ఉపాధ్యాయుడు, మదనపల్లె

విద్యార్థి సామర్థ్యం అంచనా



విద్యార్థి పఠనాశక్తిని అంచనా వేయడానికి పరీక్ష ఉంటుంది. సొంతంగా గద్యభాగం ఇస్తారు. ప్రతి అంశానికి ఐదు ప్రశ్నలు ఉంటాయి. అభ్యర్థి ప్రతి అంశాన్ని జాగ్రత్తగా చదివి ప్రశ్నలకు జవాబులను సమాధానపత్రంలో గుర్తించాలి. కింద ఒక గద్యాంశం, దానికి కొన్ని ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థి దీనిని ఒక నమునాగా గ్రహించాలి. గద్యభాగం అర్థం, తెలుగుకు సంబంధించిన గద్యభాగాలను ఎక్కువగా ఇస్తారు. చిన్న పిల్లలకు ఇచ్చే పుస్తకాల్లో ఏదైనా ఒక కథ అంశాన్ని ఎంచుకుని ఇస్తారు. తెలుగు వాచకంలో ఎక్కడ ఉండవు. వీటికి మంచి మార్కులు తెచ్చుకుంటే సీటు సాధించవచ్చు.

-క్రిష్ణయ్య, ఉపాధ్యాయుడు, మదనపల్లె

పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశాం



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పరీక్షలు రాసే విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేశాం. 26 కేంద్రాలకు సిబ్బంది,ప్రత్యేక స్క్వాడ్, ఫ్లయింగ్ స్క్వాడ్ ఉంటారు. ప్రవేశపరీక్షలో ఎక్కువ మార్కులు వచ్చిన వారికి నేరుగా సీట్లు కేటాయిస్తాం. ఇక్కడ సీటు వస్తే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుంది. అన్ని వసతులు ఉంటాయి. ఒత్తిడి చేయడం, ప్రయోగ పూర్వకంగా బోధిస్తాం. ప్రతి రోజూ ఆయా తరతగతుల ఉపాధ్యాయుల పర్యవేక్షణ ఉంటుంది.

-వేలాయుధన్, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ, మదనపల్లె

పాఠశాల విద్య రెగ్యులర్ ఆర్జేడీగా శామ్యూల్



కడప ఎడ్యుకేషన్: పాఠశాల విద్య రెగ్యులర్ ఆర్జేడీగా కాగిత శామ్యూల్‌ను ప్రభుత్వం నియమించింది. గతంలో కడప ఆర్జేడీగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డిని 2024 జులై నెలలో బదిలీ చేసింది. దీంతో అప్పట్లో కర్నూలు జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న కాగిత శామ్యూల్‌కు ఆర్జేడీగా అదనపు బాధ్యతలను అప్పగించింది. అప్పటి నుంచి కడప ఎఫ్ఏసీ ఆర్జేడీగా విధులు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈయనకు ఇటీవలే ప్రభుత్వం పదోన్నతి కల్పించి కడప రెగ్యులర్ ఆర్జేడీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నేడో, రేపో ఆయన బాధ్యతలను స్వీకరించనున్నారు.

గుంటూరు జిల్లా నుంచి...

గుంటూరు జిల్లా కర్లపాలెం గ్రామానికి చెందిన కాగిత శామ్యూల్ వ్యవసాయ కుటుంబం నుంచి బాగా చదివి 2008లో డిప్యూటీ డీఈఓ పోస్టుకు ఎంపికయ్యారు. మదనపల్లెలో తొలి ఉద్యోగాన్ని చేపట్టారు. తరువాత 2010లో ఎఫ్ఏసీ డీఈఓగా చిత్తూరు జిల్లాలో పనిచేశారు. 2012లో అనంతపురం ఎఫ్ఏసీ డీఈఓగా బదిలీపై వెళ్లారు. 2017 వరకు ఏఫ్ఏసీ డీఈఓగా అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో పనిచేశారు. 2017లో రెగ్యులర్ డీఈఓగా పదోన్నతి పొంది నెల్లూరుజిల్లాకు బదిలీపై వెళ్లారు. 2019లో బదిలీపై అనంతపురం జిల్లాకు వెళ్లారు.2023లో విజయవాడలోని విద్యాశాఖలో మోడల్ స్కూల్స్ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆదే సంవత్సరం చివరిలో పల్నాడు డీఈఓగా బదిలీపై వెళ్లారు. 2024లో కర్నూలు జిల్లా డీఈఓగా బదిలీపై వచ్చారు. గతేడాది జులై నెలలో కడప ఎఫ్ఏసీ ఆర్జేడీగా ప్రభుత్వం నియమించింది. ఇటీవలే ఆయనను కడప రెగ్యులర్ ఆర్జేడీగా నియమించింది.

క్లుప్తంగా

తాగు నీటి మోటారు వైర్లు చోరీ

అట్లూరు : మండల పరిధిలోని కమలకూరు బీసీ కాలనీలో తాగు నీటి మోటారుకు సంబంధించిన వైర్లు చోరీకి గురయ్యాయి. దీంతో పండగ పూట తాగు నీటి కోసం కాలనీ వాసులు ఇబ్బందులకు గురయ్యారు. కాలనీలో సుమారు 100 కుటుంబాల వారు నివసిస్తున్నారు. కాలనీ వాసుల తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మోటారు వెళ్లే వైర్లు, అలాగై విద్యుత్‌ లైన్‌ మీద నుంచి స్టార్టర్‌కు వెళ్లే వైర్లు మంగళవారం రాత్రి కత్తిరించుకుని వెళ్లారు. దీంతో బుధవారం కనుమ పండుగ రోజు కాలనీ వాసులు గ్రామంలోకి, చేతి పంపులు, పొలాల వద్దకు వెళ్లి తాగు నీరు తెచ్చుకోవాల్సి వచ్చింది. కాగా కాలనీ వాసులంతా వైఎస్సార్‌సీపీకి చెందిన వారు. ఎవరైనా గిట్టని వారు చేశారా లేక కాపర్‌ కోసం దొంగలు చేశారా? ఒక వేళ దొంగల పని అయితే స్టార్టర్‌ కూడా ఎత్తుకు వెళతారు కదా? అని చర్చించుకుంటున్నారు. కాగా ఈ విషయం తెలిసిన వెంటనే కమలకూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్‌ వడ్డమాను సుబ్రమణ్యంశాస్త్రి చోరీకి గురైన వైర్ల స్థానంలో కొత్త వైర్లు తెప్పించి మరమ్మతులు చేయించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌ వైరు..

పులివెందుల రూరల్‌ : పట్టణంలోని కదిరి రోడ్డులోని ఆంజనేయ స్వామి విగ్రహం సమీపంలో ఉన్న మోపూరి రామంజనమ్మ తోటలో విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ పగులగొట్టి అందులోని కాపర్‌ వైరును గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. అలాగే తోటలోని గదిలో ఉన్న మోటారు పైపులు, కేబుల్‌ వైర్లతో పాటు సామగ్రి దొంగిలించారు. సుమారు రూ.2 లక్షలు విలువ చేసే కేబుల్‌ వైర్లు చోరీకి గురయ్యాయని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జోరుగా కోడి పందేలు



మురారి చింతలలో జోరుగా సాగుతున్న కోడి పందేలు

లింగాల : లింగాల మండలం దొండ్లవాగు, మురారి చింతల గ్రామాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా కోడి పందేలు జోరుగా సాగాయి. 3 రోజుల పాటు ఈ పందేలు కొనసాగాయి. జూదంలో లక్షలాది రూపాయలు చేతులు మారాయి. పోలీసులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. ఆయా గ్రామాల టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో కోడి పందేలు నిర్వహించారు. మండలం నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది కోడి పందేల కోసం వచ్చారు.

బావిలో పడి వ్యక్తి మృతి

చాపాడు : మండల పరిధిలోని నక్కలదిన్నె గ్రామ సమీపంలోని పంట పొలాలలో బుధవారం మధ్యాహ్నం కొట్టాలు గ్రామానికి చెందిన సంగ్రా వెంకటయ్య(38) అనే వ్యక్తి బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటయ్య పంట పొలాల్లోని బావి దగ్గరికి వెళ్లి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా ప్రమాదవశాత్తు బావిలో పడ్డాడు. ఈ ఘటనను గమనించిన స్థానికులు గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. గత ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుడు ప్రమాదశాత్తు పడ్డాడా లేక మద్యం సేవించి బావిలో పడ్డాడా అనే విషయం పోస్టుమార్టం నివేదికలో తేలుతుందని ఎస్‌ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. మృతుడికి భార్య యశోద, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లెకు చెందిన చిన్నప్ప(24) కుటుంబ పోషణ నిమిత్తం ఊరూరా తిరిగి తినుబండారాల వ్యాపారం చేస్తుంటాడు. మంగళవారం వ్యాపారం ముగించుకుని ద్విచక్రవాహనంలో తిరిగి వెళుతుండగా దొమ్మన్నబావి వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

‘స్వాహా’కార సంఘం!

- పోలీస్‌ కో–ఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీలో గోల్‌మాల్‌
- దాదాపు రూ. కోటి ఏడు లక్షల మేర నిధుల స్వాహా
- ఆగస్టులో మైదుకూరు డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ ప్రారంభం
- ‘పోలీస్‌ బాస్‌’ రాజకీయ బదిలీతో మరుగున పడిన వ్యవహారం



కడపలోని పోలీస్‌ కో–ఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీ కార్యాలయం

కడప అర్బన్‌ : సమాజంలో పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తుంటారు. పోలీసు శాఖలో అధికారులు, సిబ్బంది క్రమశిక్షణకు మారుపేరుగా ఉంటారు. తప్పు చేస్తే చర్యలు తప్పవని మునుపటి రోజుల్లో ప్రజలు భావించేవారు. ప్రస్తుత రోజుల్లో కింది స్థాయి సిబ్బందిపై అవినీతి ఆరోపణలు వస్తే వారిపై వెంటనే క్రమశిక్షణా చర్యలుంటాయి. ఎస్‌ఐ ఆపై ర్యాంకు స్థాయి అధికారి తప్పు చేస్తే కేవలం ఛార్జిమెమో, వార్నింగ్‌లతో సరిపెడతారని, తరువాత వారు తప్పుల మీద తప్పులు చేసినా, ఇంతేగదా అనే విధంగా ఉంటోంది. పోలీసు శాఖలో కొందరు అధికారుల నిర్వాకం, కూటమి పార్టీ నేతల అండదండలు మెండుగా ఉండటంతో పోలీసు శాఖలో కొందరు అవినీతి అధికారులు, సిబ్బంది తమ స్థాయికి మించి అవినీతికి పాల్పడుతున్నారని తెలుస్తోంది. గత ఏడాది ఎస్పీ హర్షవర్ధన్‌ రాజు పనిచేసిన సమయంలో ఆగస్టు నెలలో కడపలోని జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని ‘పోలీస్‌ కో ఆపరేటివ్‌ సొసైటీ’లో జరిగిన అవినీతిపై అక్కడ పనిచేస్తున్న ఓ ఉద్యోగి చేతివాటంతో రూ.కోటి ఏడు లక్షల మేరకు గోల్‌మాల్‌ జరిగిందని ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో సదరు సొసైటీ అవినీతిపై విచారణ చేయాలని మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్‌కు అప్పగించారు. తరువాత ఆ విచారణ ఏమేరకు పూర్తయిందో తెలీదుకానీ, ‘పోలీసు బాస్‌’ హర్షవర్ధన్‌ రాజు రాజకీయ బదిలీతో మరుగున పడినట్లయింది.

అవినీతి ఎలా జరిగిందంటే..

ఈ పోలీస్‌ కో– ఆపరేటివ్‌ సొసైటీ స్థాపించే క్రమంలో నామమాత్రంగానే ఏర్పాటు చేశారు. ఆ తరువాత సొసైటీకి సంబంధించిన కార్యవర్గం, అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రంగానే ఉంది. ఆడిటింగ్‌ లాంటి ప్రక్రియలు అస్సలే జరగలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తరువాత అక్కడ పనిచేస్తున్న ఓ ఉద్యోగి చేతివాటం కాస్త వేల రూపాయల నుంచి లక్షలు, ఆ తరువాత రూ. కోటి ఏడు లక్షల మేరకు గోల్‌మాల్‌ చేసి పక్కా అవినీతికి పాల్పడినట్లు బయటకు పొక్కింది. అవినీతికి పాల్పడిన ఉద్యోగి తన వద్దకు రుణం కోసం వచ్చిన వారి దరఖాస్తులను పరిశీలించి అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి రుణం ఇవ్వాల్సి ఉంటుంది. గతంలో ఎవరైనా రుణం తీసుకున్న వారు ఉంటే వారి రుణం పూర్తిగా చెల్లించిన తరువాతనే మరోసారి జాబితా వరుస క్రమంలో రుణం ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఆ నిబంధనలు ఏవీ పాటించకుండానే... ఉదాహరణకు గతంలో రూ. 3 లక్షలు రుణం తీసుకున్న సభ్యుడు ఇంకా రూ. 50 వేలు బాకీ ఉండగానే రెన్యువల్‌ రూపంలో రూ. 3 లక్షలు ఎంచక్కా ఇచ్చేసి అతను ఇచ్చిన డబ్బులను తన సొంతానికి వాడుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం సభ్యత్వం ఉన్న వారిలో కొందరు తమకు రుణం ఇవ్వకపోతే డబ్బులను వెనక్కి ఇవ్వాలని పట్టుబట్టారు. తరువాత తమ దగ్గర డబ్బులులేవని, రుణాల రూపంలో కొందరు సభ్యులకు ఇచ్చామని దాటవేసే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే రూ. కోటి ఏడు లక్షల మేరకు అవినీతికి పాల్పడినట్లు సమాచారం. ఆ సమాచారం ఆ నోటా, ఈ నోటా బయటకు వచ్చి చివరకు అప్పటి పోలీస్‌ బాస్‌ హర్షవర్ధన్‌ రాజు దృష్టికి వెళ్లింది. ఆయన వెంటనే స్పందించి మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు విచారణ కోసం అప్పగించారు. ఆయన తమ సిబ్బందితో కలిసి విచారణ ప్రారంభించారు. సభ్యులలో కొందరు తమకు న్యాయం జరుగుతుందా? లేక ఆ డబ్బులను అలాగే వదులుకోవాల్సిందేనా? అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విచారణ అధికారి వివరణ : ఈ సంఘటనపై మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా, తమ సిబ్బందితో కలిసి లోతుగా విచారణ చేస్తున్నామని తెలిపారు. త్వరలోనే ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామన్నారు.

ఎస్పీ మనీష్‌ కుమార్‌ సిన్హా హయాంలో సొసైటీ ప్రారంభం ..

కడప నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో 2013లో అప్పటి ఎస్పీ మనీష్‌కుమార్‌ సిన్హా హయాంలో పోలీసు శాఖలో పనిచేస్తున్న హోంగార్డు, పోలీసు కానిస్టేబుల్‌ స్థాయి నుంచి ఎస్‌ఐ స్థాయి వరకు రూ.2000 సభ్యత్వ రుసుముతో ‘పోలీస్‌ కో–ఆపరేటివ్‌ క్రెడిట్‌ సొసైటీ’ని స్థాపించారు. పోలీసు కార్యాలయం సిబ్బందితో పాటు మినిస్ట్రీరియల్‌ స్టాఫ్‌కు కూడా మేలు జరగాలనే సదుద్దేశంతో ఈ సొసైటీని ప్రారంభించారు. ఇన్‌చార్జి అధికారిగా ఆర్‌ఐ(వెల్ఫేర్‌)ను నియమించారు. ప్రతి సభ్యుడు తనకు వచ్చే జీతంలో రూ.2వేలు ప్రతి నెలా సభ్యత్వ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఆ సభ్యత్వ రుసుం చెల్లించిన తరువాత నెల నుంచే ఒక్కొక్కరు హోంగార్డుకు రూ.2 లక్షలు, కానిస్టేబుల్‌ స్థాయి నుంచి ఎస్‌ఐ స్థాయి వరకు, మినిస్ట్రీరియల్‌ స్టాఫ్‌తో సహా తమ ‘పే స్లిప్‌’ను అప్లికేషన్‌తో పాటు జత చేసి ఇస్తే వారు రూ. 3లక్షల చొప్పున రుణంగా తీసుకోవచ్చు. తమ అవసరాలను బట్టి ఆ డబ్బులను రుణంగా పొంది మరలా వాయిదాల రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రుణాలు పొందే విషయంలో కూడా సరైన కారణం దృష్ట్యా, అత్యవసరాల మేరకు రుణాన్ని అధికారుల అనుమతితో పొందవచ్చు. అలా ఈ సొసైటీలో 1800 మంది సభ్యులుగా చేరారు. తరువాత కొందరు రుణాలను పొంది 5 శాతం వడ్డీతో వాయిదాలు చెల్లించేవారు. చందా కట్టిన సభ్యులకు మాత్రం వారి మొత్తానికి రూ. 4 శాతం వడ్డీ చెల్లించేవారు. ఇలా వారికి వడ్డీ రూపంలో వచ్చిన 1 శాతం లాభాన్ని కరెంట్‌ బిల్లు, కార్యాలయం నిర్వహణ కోసం ఖర్చు చేసేవారు. ఇలా పోలీసు కో– ఆపరేటివ్‌ సొసైటీ దిన దిన ప్రవర్ధమానంగా మారింది. ఉమ్మడి జిల్లా నుంచి వైఎస్‌ఆర్‌ జిల్లా పోలీసు యంత్రాంగం విడిపోవడంతో వేయిమంది సభ్యులయ్యారు. ఈ క్రమంలో రుణం తీసుకున్న వారి నుంచి వారి సభ్యత్వ డబ్బులు పోగా మిగిలిన డబ్బులను సరిచూసుకుని సభ్యులకు రావాల్సిన డబ్బులను తిరిగి చెల్లించేశారు. వైఎస్‌ఆర్‌ జిల్లాలో మాత్రమే సభ్యులుగా ఉన్నవారిలో కొందరు తమ లెక్కలు సరిచూసుకుని మానుకున్నారు. మిగిలిన వారు సభ్యులుగా కొనసాగుతున్నారు.

కారు ఢీకొని..



ప్రమాదంలో మృతి చెందిన సురేష్‌

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల శివారులో కమ్మవారిపల్లె వద్ద బుధవారం ఉదయం 6 గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతా సురేష్‌(27) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. పుల్లివీడు పంచాయతీ పేరమ్మగారిపల్లెకు చెందిన సురేష్‌ తెల్లవారుజామునే మాంసం కోసం పోరుమామిళ్ల వస్తుండగా పట్టణ సమీపంలో పోరుమామిళ్ల నుంచి బద్వేలు వైపు వెళుతున్న కారు ఢీ కొంది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళుతున్న వ్యాన్‌ను సురేష్‌ క్రాస్‌ చేసే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న కారు ఢీ కొన్నట్లు తెలుస్తోంది. సురేష్‌కు ఏడు నెలల క్రితమే సుప్రియ(20)తో వివాహమైంది. ప్రస్తుతం ఆమె గర్భవతి అని తెలిసింది. పెళ్లైన ఏడు నెలలకే భర్త మృతి చెందటాన్ని ఆ యువతి జీర్ణించుకోలేక పోతోంది. సురేష్‌ పోరుమామిళ్లలోని ఓ గార్మెంట్స్‌ షాపులో గుమస్తాగా పని చేస్తున్నాడు. పోలీసులు కేసు నమోదు చేశారు. పేరమ్మగారిపల్లెలో విషాదం అలుముకుంది.

కరెంట్‌ షాక్‌తో బాలుడికి తీవ్రగాయాలు

మదనపల్లె : గాలిపటాలు ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు బాలుడు కరెంట్‌షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన సంఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని దిగువకురవంకకు చెందిన చెన్నకేశవ కుమారుడు చరణ్‌(13) స్థానికంగా ఏడో తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా మిద్దెపైకి వెళ్లి గాలిపటం ఎగురవేస్తూ వెనక్కు వచ్చి ప్రమాదవశాత్తు కరెంట్‌ తీగలకు తాకగా, షాక్‌కు గురయ్యాడు.

ఆకట్టుకున్న బండలాగుడు పోటీలు



వెదురూరులో జన సందోహం నడుమ బండలాగుతున్న ఎద్దు

చాపాడు : మండల పరిధిలోని వెదురూరు, నరహరిపురం గ్రామాల్లో కనుమ సందర్భంగా బుధవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ పోటీలను తిలకించేందు వివిధ గ్రామాల నుంచి వేలాది ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వెదురూరులో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌, నరహరిపురంలో ప్రభుత్వ ఉద్యాన మాజీ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, టీడీపీ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్నారు.


వెదురూరులో నంద్యాల ఎద్దు ప్రథమ స్థానం..

వెదురూరు గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీలలో నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దు ప్రథమ స్థానంలో నిలువగా, ప్రొద్దుటూరు వైఎంఆర్‌ కాలనీకి చెందిన డి.గురివిరెడ్డి ఎద్దు ద్వితీయ, కల్లూరుకు చెందిన పి.శివకృష్ణయాదవ్‌ ఎద్దు తృతీయ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా బోడచెర్లకు చెందిన నక్షత్రరెడ్డి ఎద్దు నాలుగవ, వైఎస్సార్‌ జిల్లా రంగోరుపల్లెకు చెందిన మహేందర్‌రెడ్డి ఎద్దు ఐదో స్థానంలో గెలుపొందాయి.

నరహరిపురంలో ప్రొద్దుటూరు ఎద్దు ప్రథమ స్థానం..

నరహరిపురం గ్రామంలో నిర్వహించిన బండలాగుడు పోటీలలో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దు ప్రథమ స్థానంలో నిలిచాయి. మైదుకూరుకు చెందిన వెంకటేశ్వరయాదవ్‌ ఎద్దు ద్వితీయ, ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తల చంద్ర ఓబుళరెడ్డి ఎద్దు తృతీయ బహుమతి పొందాయి. నంద్యాల జిల్లా గుంపరామనుదిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎద్దు నాలుగవ, కమలాపురానికి చెందిన టీవీ కుమారి ఎద్దు ఐదవ స్థానంలో నిలిచాయి.

టీడీపీ వర్గీయుల ఘర్షణ



వి.రాజుపాళెం గ్రామంలో టీడీపీ వర్గీయులు చింపేసుకున్న ఫ్లెక్సీలు

చాపాడు : మండల పరిధిలోని వి.రాజుపాళెం గ్రామంలో టీడీపీకి చెందిన ఇరువర్గాల వారు బుధవారం మధ్యాహ్నం ఘర్షణ పడ్డారు. వెదురూరు, నరహరిపురం గ్రామాల్లో సంక్రాంతి కనుమ సందర్భంగా రెండు చోట్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇరు గ్రామాలకు చెందిన నిర్వాహకులు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌ యాదవ్‌ను ఆహ్వానించారు. మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఎమ్మెల్యే పుట్టా కాన్వాయ్‌ రాజుపాళెం గ్రామంలో ఆపారు. ఎమ్మెల్యే కారు దిగి కార్యకర్తలతో మాట్లాడుతుండగా ఇదే గ్రామానికి చెందిన పల్లెం శ్రీనివాసులు తన ఇంటికి రమ్మని ఎమ్మెల్యేను ఆహ్వానించాడు. దీంతో నరహరిపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు తాము ఎమ్మెల్యేను ఆహ్వానించామని నీవేలా ఇంటికి పిలుస్తావంటూ శ్రీనివాసులును అడ్డుకున్నారు. ఈ సమయంలో టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అక్కడి నుంచి ఎమ్మెల్యే పుట్టా నరహరిపురం వెళ్లి అక్కడి నుంచి వెదురూరుకు వెళ్లి అక్కడ సంగమేశ్వర స్వామిని దర్శించుకుని వెళ్లిపోయారు. అనంతరం గ్రామంలో ఉన్న శ్రీనివాసులుకు చెందిన ఫ్లెక్సీ, రాజుపాళెం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, మాజీ ఎంపీటీసీ ఓబులేసు, రమణకు చెందిన ఫ్లెక్సీలను చించేశారు. ఈ నేపథ్యంలో నరహరిపురానికి చెందిన కొందరు టీడీపీ వర్గీయులు రాజుపాళెం వెళ్లారు. అక్కడ తిరిగి ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. గ్రామంలో గొడవలు జరగకుండా పోలీసులు పహారా కాస్తున్నారు. గత నాలుగైదు నెలలుగా ఈ గ్రామాల్లో టీడీపీకి చెందిన ఇరువర్గాల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది.

విషద్రావణం తాగి మహిళ ఆత్మహత్య

లింగాల : గుణకణపల్లి గ్రామంలో హసీనా 40 అనే మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగ తులసి ప్రసాద్‌ కథనం మేరకు .. హసీనా అప్పులు చేసి కువైట్‌లో ఉద్యోగం కోసం వెళ్లింది. అక్కడ ఉద్యోగం దొరక్క తిరిగి వచ్చేసింది. కువైట్‌ వెళ్లేందుకు వీసా, విమాన ఖర్చులు కలిపి సుమారు నాలుగు లక్షల రూపాయల దాకా అప్పు చేసింది. దీంతో అప్పు తీర్చే మార్గం కనిపించక ఈనెల 10వ తేదీన ఇంటిలో విషద్రావణం తాగింది. వెంటనే ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిందని ఎస్‌ఐ తెలిపారు. ఆమెకు భర్త సంజీవ్‌, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనారోగ్య కారణాలతో..

పెద్దముడియం : మండలంలోని పాలూరు గ్రామంలో ఉండే తిరుపతి నాగలక్షుమ్మ(70) అనే వృద్ధురాలు అనారోగ్య కారణాలతో కుందూ నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు నాగలక్షుమ్మ కట్టుబడిగా పని చేసేది. గత కొంత కాలంగా వెన్నునొప్పితో తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఉండేది. ఈ నెల 13న కర్నూలు జిల్లా ఆదోనిలో ఉండే కూతురు దగ్గరకు వెళుతున్నానని చెప్పి కుందూ నదిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అల్లుడు ప్రతాప్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



రామ్మోహన్‌ మృతదేహం

కలకడ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం కలకడ–గుర్రంకొండ మార్గంలోని కె.దొడ్డిపల్లె పంచాయతీ బుడ్డకాలువ వంక సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం, రాతిగుంటపల్లె మాజీ సర్పంచ్‌ మద్దిశెట్టి రమాదేవి భర్త రామ్మోహన్‌ (52) తన ద్విచక్రవాహనంలో కలకడలో తన వ్యక్తి గత పని ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యాడు. స్వగ్రామం చేరుకుంటున్న సమయంలో మార్గమధ్యంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదం జరిగిన స్థలంలోనే దుర్మరణం చెందాడు. ద్విచక్రవాహనం దెబ్బతినకపోవడంతో మృతిపై స్థానికుల్లో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మృతుడికి భార్య రమాదేవి, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కుమారుడు హరీష్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలకడ పోలీసులు కేసు నమోదు చేశారు.

వ్యక్తిపై దాడి

మదనపల్లె : వాహనం బాడుగకు కావాలని డ్రైవర్‌ను పిలిపించి దాడిచేసిన ఘటన మంగళవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. సీటీఎంకు చెందిన ఆంజనేయులు(45) టాటా ఏస్‌ వాహనం బాడుగకు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో స్థానికుడైన సునీల్‌, బెంగళూరుకు బాడుగ ఉందని, సప్పలమ్మ గుడివద్దకు రావాలని ఆంజనేయులును కోరాడు. దీంతో ఆంజనేయులు సప్పలమ్మ గుడి వద్దకు చేరుకోగా, బెంగళూరుకు బాడుగ ఎంతని వారు అడగటం, రూ.10వేలు అవుతుందని ఆంజనేయులు చెప్పడంతో, రూ.7 వేలకు రావాల్సిందిగా సునీల్‌, మహేష్‌, నీల్‌, ఒత్తిడి చేశారు. దీంతో ఈ విషయమై వివాదం రేగగా, ఆంజనేయులుపై ముగ్గురూ కలిసి దాడిచేసి గాయపరిచారు. గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పండగ పూట విషాదం

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితుల దుర్మరణం



వెంకటసుమంత్‌ (ఫైల్‌)



సందీప్‌ (ఫైల్‌)

బద్వేలు అర్బన్‌ : పండగ పూట ఆనందోత్సాహాలు వెల్లివిరియాల్సిన గ్రామంలో విషాదం అలుముకుంది. కుటుంబ సభ్యులు, బంధువులతో సంతోషంగా పండగ జరుపుకుందామని కలలు గన్న ఆ యువకుల కలలను రోడ్డు ప్రమాదం కబళించింది. మృతులిద్దరూ స్నేహితులు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బద్వేలు – పోరుమామిళ్ల రహదారిలోని గుండంరాజుపల్లె సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా... మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని రాయప్పగారిపల్లెకు చెందిన సుబ్బరాయుడు, సుజాతల కుమారుడు కోన వెంకటసుమంత్‌ (23) రెండు నెలల క్రితమే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగం సాధించాడు. సంక్రాంతి పండుగకు అమ్మమ్మగారి ఊరైన బద్వేలు పట్టణానికి సమీపంలోని పెద్దఅగ్రహారం గ్రామానికి రెండు రోజుల క్రితం వచ్చాడు. ఇదే గ్రామానికి చెందిన పగడాల సుబ్బరాయుడు, ఆదిలక్షుమ్మల చిన్న కుమారుడు పగడాల సందీప్‌ (20) నెల్లూరులోని ఓ ఫొటో స్టూడియోలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుండేవాడు. సంక్రాంతి పండుగ సందర్భంగా రెండు రోజుల క్రితమే స్వగ్రామానికి చేరుకున్నాడు. సుమంత్‌, సందీప్‌లు ఇరువురు చిన్ననాటి స్నేహితులు. ఇరువురు కలిసి భోగిపండుగ నాడు, సంక్రాంతి పండుగ నాడు ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అయితే సాయంత్రం సమయంలో సరదాగా బయటికి వెళ్దామని ఇరువురు కలిసి తమ ద్విచక్ర వాహనంలో వెళుతుండగా గుండంరాజుపల్లె సమీపంలోని మలుపు వద్దకు రాగానే బైక్‌ అదుపుతప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో సుమంత్‌ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన సందీప్‌ను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. ప్రాణస్నేహితులైన ఇరువురు ఒకే రోజు మృతి చెందడంతో బంధువులు, స్నేహితులు బోరున విలపించారు. అర్బన్‌ ఎస్‌ఐ రవికుమార్‌ కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుత్‌ తీగలు తగలి చిన్నారికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చిన్నారి జయంత్‌రెడ్డి

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం ఆరో వార్డులోని క్రాంతినగర్‌ కాలనీలో సంక్రాంతి పండగ రోజైన మంగళవారం విషాదం చోటు చేసుకుంది. ఈ కాలనీలో ఇళ్ల మధ్యలో అతి తక్కువ ఎత్తులో ఉన్న 33 కేవీ విద్యుత్‌ లైన్‌ తీగలు తగిలి జయంత్‌రెడ్డి అనే చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం చిన్నారులందరు ఆడుకునేందుకు మిద్దెపైకి వెళ్లారు. అక్కడ ఆడుకుంటూ ఉండగా 33 కేవీ విద్యుత్‌లైన్‌ షార్ట్‌ సర్క్యూట్‌ అయి చిన్నారి జయంత్‌రెడ్డికి శరీరమంతా కాలిపోయింది. వెంటనే స్థానికులు చిన్నారిని ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో పాటు ఆ ప్రాంతంలోని ఇళ్లలో ఉన్న ఎలక్ట్రికల్‌ వస్తువులు కాలిపోయాయి. ఈ లైన్‌ ఇళ్ల మధ్యలో ఉందని తొలగించాలని ఆ వార్డు కౌన్సిలర్‌ నాగిరెడ్డి పలుమార్లు సంబంధిత అధికారుకు విన్నవించినా ప్రయోజనం లేదు.

మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ ఎం.సుధీర్‌రెడ్డి పరామర్శ..

ప్రమాద విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్‌ ఎం. సుధీర్‌రెడ్డి వెంటనే ఆరో వార్డులో పర్యటించి బాధితుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వెంటనే స్థానిక అధికారులతో మాట్లాడి లైన్‌ను ఇళ్ల మధ్యలో నుంచి తొలగించాలని కోరారు.

డాక్టర్‌ అవతారమెత్తి!

- రోగి నుంచి చైన్‌ కొట్టేసిన యువతి
- తిరుపతి రుయాలో ఘటన
- నిందితురాలిది వైఎస్సార్‌ జిల్లా వల్లూరు మండలం



చైన్‌ కొట్టేసిన నకిలీ డాక్టర్‌

తిరుపతి తుడా : పేద రోగులే టార్గెట్‌గా దొంగల ముఠా రుయాలో హల్‌ చల్‌ చేస్తోంది... రోగుల సహాయకులుగా తరచూ పేషంట్‌ వార్డుల్లో తిరుగుతూ సెల్‌ఫోన్లు, పర్సులు దొంగతనం చేసే ముఠా ఇప్పుడు కొత్త అవతారం ఎత్తింది. ఏకంగా తెల్ల కోటు ధరించి డాక్టర్‌ అవుతారమెత్తి దొంగతనాలకు పాల్పడడం కలకలం రేపుతోంది. రుయా ఆస్పత్రిలో తరచూ మొబైల్‌ ఫోన్లు, పర్సులు, ఏటీఎం కార్డులు, బైక్‌ దొంగతనాలు జరగడం సర్వసాధారణమైంది. రుయాలో సీసీ నిఘా, సెక్యూరిటీ వ్యవస్థ పటిష్టంగా ఉన్నా దొంగలు రోజుకో అవతారం ఎత్తుతున్నారు.

బంగారు చైన్‌ కొట్టేసి..

తెల్ల కోటుతో వచ్చి రోగులను బురిడీ కొట్టించి ఐదు సవర్ల బంగారు చైను చోరీ చేసిన యువతిని సెక్యూరిటీ సిబ్బంది అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం రుయాలో జరిగింది. వైఎస్సార్‌ జిల్లా వల్లూరుకు చెందిన శ్రీవాణి అనే యువతి తెల్ల కోటు ధరించి అనస్థీషియా టెక్నీషియన్‌ అని రోగులకు చెప్పుకుంటూ అత్యవసర విభాగంలో హల్‌చల్‌ చేయసాగింది. ఈ క్రమంలో అప్పుడే రేణిగుంట నుంచి గాయాలతో వైద్యం కోసం వచ్చిన వెస్లీ అనే మహిళను గుర్తించి ఆమెతో పరిచయం చేసుకొని ఆమెను స్కానింగ్‌ కోసం తీసుకెళ్లి అక్కడ ఒంటిపై నగలు తీసేయాలని సూచించింది. వెస్లీ తన ఒంటిపై ఉన్న రెండు బంగారు చైన్లు, రెండు బంగారు గాజులను తీసి ఆ యువతి చేతికి ఇచ్చి బయట తన భర్త చేతికి ఇవ్వాలని చెప్పింది. ఆ నగల్లో ఐదు సవర్ల బంగారు గొలుసును తన బ్యాగులో వేసుకొని మిగిలిన వస్తువులను వెస్లీ భర్త చేతికి ఇచ్చింది. ఇందులో మరో చైన్‌ ఉండాలని వెస్లీ భర్త విక్టరీ అడగటంతో మాకేం తెలుసు అంటూ ఆ యువతి అక్కడినుంచి వెళ్లిపోయింది. అనంతరం స్కానింగ్‌ నుంచి బయటికి వచ్చిన వెస్లీ నగలు చూసి అందులో ఒక చైన్‌ లేకపోవడాన్ని గుర్తించి ఆ విషయాన్ని వెంటనే సెక్యూరిటీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లింది. సెక్యూరిటీ సిబ్బంది వెంటనే అప్రమత్తమై వెతకగా అక్కడే ఉన్న యువతిని గుర్తించి ఆమె బ్యాగులో ఐదు సవర్ల బంగారు చైన్‌ను గుర్తించారు. వెంటనే విషయాన్ని వెస్ట్‌ పోలీసులకు తెలిపి ఆ యువతిని పోలీసులకు అప్పగించారు.

పార్వతీపురంలో చోరీ

సిద్దవటం : పార్వతీపురం రోడ్డు నంబర్‌ 4లో ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో వంట మనిషిగా పనిచేస్తున్న పెంచలమ్మ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు 10 తులాల బంగారు, రూ. 36వేల నగదు చోరీ చేశారు. బాధితురాలి కథనం మేరకు..శనివారం రాత్రి తమ అత్త నరసమ్మ అనారోగ్యం ఆసుపత్రిలో ఉండటంతో కడపకు వెళ్లారు. తమ ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న వారు సోమవారం ఉదయం ఫోన్‌ చేసి మీ ఇంటి తాళాలు తీసి ఉన్నాయని సమాచారం ఇచ్చారు. దీంతో 100 నంబర్‌కు ఫోన్‌ చేసి పోలీసులకు తెలియజేశారు. మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పట్టుకున్నారు .. వదిలేశారు!

గుర్రంకొండ : గుర్రంకొండలో పోలీసులు 25 టన్నులు గల రేషన్‌ బియ్యం లారీని ఉదయం పట్టుకొని సాయంత్రం వదిలేశారు. రేషన్‌ బియ్యం లారీ విషయమై పోలీస్‌ స్టేషన్‌ వద్ద రోజంతా హైడ్రామా నడిచింది. ఈ లారీకి సంబంధించి ఉదయం లేని రికార్డులు సాయంత్రానికల్లా పోలీస్‌ స్టేషన్‌కు చేరుకోవడంతో పోలీసులు హడావిడిగా బియ్యం లారీని వదిలేశారు. గుర్రంకొండలో బుధవారం ఉదయం 4 గంటలకు స్థానిక పోలీసులు రేషన్‌ బియ్యం లారీని అదుపులోకి తీసుకొని స్టేషన్‌ వద్దకు తీసుకెళ్లారు. సదరు రేషన్‌ బియ్యం లారీ వెయ్యి 25 కేజీల బియ్యం బస్తాలతో రాయచోటి నుంచి కర్ణాటక రాష్ట్రం చింతామణికి వెళుతున్నట్లు సమాచారం. రేషన్‌ బియ్యం లారీని పోలీసులు అదుపులోకి తీసుకొన్న సమయం నుంచి హైడ్రామా మొదలైంది.

పోలీసులు లారీని అదుపులోకి తీసుకొన్న సమయంలో రికార్డులు సరిగ్గా లేవని పేర్కొన్నారు. ఉదయం 8.30 గంటలకు వాల్మీకిపురం సివిల్‌ సప్లయ్స్‌ డీటీ ఫజులుల్లా పోలీస్‌ స్టేషన్‌ వద్దకు చేరుకున్నారు. ఆయన పోలీస్‌ స్టేషన్‌కు చేరుకొన్న కొద్దిసేపటికే వాల్మీకీపురం సీఐ ప్రసాద్‌ స్టేషన్‌ వద్దకు వచ్చారు. గంటల కొద్ది రెవెన్యూ, పోలీసు అధికారులు పోలీస్‌ స్టేషన్‌లో తర్జన భర్జన పడ్డారు. పోలీసులకు పట్టుబడిన రేషన్‌ బియ్యం లారీలో కొంత బియ్యాన్ని రేషన్‌ బియ్యం అవునా.. కాదా అని తేల్చడానికి రాయచోటికి పరీక్షకు పంపించామని అధికారులు మధ్యాహ్నం సమయంలో ప్రకటించారు. మరో సారి జిల్లా రెవెన్యూ అధికారులకు విషయం తెలియజేశామని లారీలో కొన్ని రికార్డులు అందుబాటులో ఉన్నాయని అవి సరైనవో కావో జిల్లా రెవెన్యూ అధికారులు చెప్పాల్సి ఉందంటూ డీటీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన ఓ ఉన్నతశ్రేణి అధికార పార్టీ నాయకుడి నుంచి పెద్ద ఎత్తున సిఫార్సులు అధికారులకు వెళ్లినట్లు సమాచారం. మరోవైపు స్థానిక అధికార పార్టీ నాయకులు రోజు రేషన్‌ బియ్యం లారీలు గుర్రంకొండ నుంచి వెళుతున్నాయని, ఎట్టిపరిస్థితుల్లోనూ లారీపై కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. అయితే ఏం జరిగిందో కానీ సాయంత్రానికల్లా పోలీస్‌ స్టేషన్‌ వద్ద ఉన్న రేషన్‌ బియ్యం లారీని పోలీసులు వదిలేశారు.